RNI No. APTEL/2010/ 36692 AKSHARA PRAKASAM aksharaprakasam@gmaiil.com

అక్షర ప్రకాశం

Published From Prakasam People News Paper

సంపుటి : 15 సంచిక : 294 సెప్టెంబర్ 11 శుక్రవారం 2026 ప్రకాశం పేజీలు : 4 వెల - 2

పేదల సొంతింటి కల నెరవేర్చాలి

కలెక్టర్లకు సీఎం చంద్రబాబు ఆదేశం

సెప్టెంబర్ 10 : రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇంటి స్థలం పట్టా అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణం, పేదల ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై అమరావతిలో ఈ రోజు (గురువారం) జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన సమీక్షించారు. ఈ ప్రక్రియను ఏడాదిలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 1.43 లక్షల మందిని ఇళ్ల పట్టాలకు అర్హులుగా గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరో 1.26 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, అక్టోబర్ 15 నాటికి వాటన్నింటినీ పూర్తిచేస్తామన్నారు. 1,692 గ్రామాల్లో సుమారు 18 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన భూమిని ఇప్పటికే గుర్తించామని వివరించారు. కొత్తగా ఎంతమందికి ఇళ్ల పట్టాలివ్వాలి? ఎంతమంది ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించాల్సి ఉందనే అంశంపై పక్కాగా లిస్ట్ ప్రిపేర్ చేయాలని సీఎం ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పట్టాలు పంపిణీ చేయాలని సూచించారు. ఏపీలో గృహ నిర్మాణ పురోగతి వివరాలపై చంద్రబాబు ఆరా తీయగా.. ఇప్పటివరకు 5.92 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తైనట్లు అధికారులు తెలిపారు. మరో 5.32 లక్షల ఇళ్లు ఆయా దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నిర్మాణంలో ఉన్న అన్ని గృహాలనూ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు ఇచ్చే ఏర్పాట్లు చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఇళ్ల నిర్మాణం, ఇంటి పట్టాల పంపిణీ విషయంలో కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేసిన ఆయన.. 10 రోజుల్లో సమగ్ర యాక్షన్ ప్లాన్‌తో రావాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణం, పట్టాల అంశాలకు జిల్లా కలెక్టర్లు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తిచేసేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు కూడా చొరవ తీసుకుని అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఇందుకోసం టైమ్ బౌండ్ ప్రోగ్రాం రూపొందించి అమలు చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన పేదలకు ఇళ్లు, ఇంటి స్థలం అందించడం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఒకటని పేర్కొంటూ.. ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

డీకే శివకుమార్ పాలనకు 100 రోజులు..

సిద్ధరామయ్య ఏమన్నారంటే...!

సెప్టెంబర్ 10 : కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధ రామయ్య ధీమా వ్యక్తం చేశారు. శివకుమార్ ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు, ఆయన మంత్రివర్గానికి సిద్ధరామయ్య అభినందనలు తెలియజేశారు. విధానసౌధలోని బాంక్వెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన 'దృఢ కర్ణాటక సంకల్ప - 100 రోజుల విజయవంతమైన ప్రస్థానం' కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసంగించారు. 100 రోజుల మైలురాయి అనేది కేవలం వేడుకలకు పరిమితం కాకూడదని, ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచి, బాధ్యతలను ఏ మేరకు నెరవేరుస్తోందో నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని ఆయన పేర్కొన్నారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని సర్కార్ సరైన మార్గంలోనే సాగుతోందని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

తెలుగు సాహితీ మకుటం కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ

- ఘనంగా కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలు

ఒంగోలు, అక్షర ప్రకాశం : తన అద్భుతమైన రచనలతో తెలుగు సాహిత్యానికి మొట్టమొదటి జ్ఞానపీఠ అవార్డు సాధించిపెట్టిన కవిశ్రేష్ఠుడు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 131వ జయంతి వేడుకలను సంస్కార భారతి ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీమద్రామాయణ కల్పవృక్ష కావ్యానికి జ్ఞానపీఠ్ అవార్డు సాధించి, కేంద్ర ప్రభుత్వం ద్వారా పద్మభూషణ్ అవార్డు పొందిన సాహితీ దిగ్గజం విశ్వనాథ సత్యనారాయణ అని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. వేయి పడగలు, ఏకవీర, కిన్నెరసాని పాటలు, మధ్యాక్కరాలు రచించి తెలుగు సాహిత్యానికి ఎనలేని కీర్తిని తీసుకువచ్చారన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఆస్థాన కవిగా, రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా గౌరవాన్ని పొందారని కొనియాడారు. పత్తి రామానుజకూటంలో సంస్కారభారతి జిల్లా కన్వీనర్ పత్తి రంగమన్నారు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విశ్వనాథ వారి జయంతిని తెలుగు సాహితీ దినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేసారు. తెలుగు భాషను విద్యార్థి స్థాయికి తీసుకెళ్లాలనే సంకల్పంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. పింగళి కోదండ రామయ్య, సంస్కృత కళాశాల కరస్పాండెంట్ కోటి సూర్యనారాయణ మాట్లాడుతూ మన తెలుగు జాతి కీర్తిని దిగంతాలకు చాటిని మహోన్నతులు జయంతి, వర్ధంతులను నిర్వహిస్తూ యువతరానికి చేరువకావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కార భారతి కార్యదర్శి ఎన్.మాల్యాద్రి, పలు సాహితీ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు కె.ఎస్.వి.ప్రసాద్, ఒరుగంటి ప్రసాద్, రామచంద్రుని శ్రీనివాసరావు, కుర్రా ప్రసాద్‌బాబు, నేచర్ ఫౌండేషన్ రాజశేఖర్, గాయకులు ఐ.మురళి కృష్ణ, మొవ్వా నాగేశ్వరరావు, పింగళి పూర్ణచంద్రరావు, బనారె, గుర్రం కృష్ణ, జాలాది మోహన్, ఆనంద్, పర్వతం రాంప్రసాద్, పిన్నంరాజు నరసింహారావు, విశ్వాసేవిక ట్రస్ట్ నిర్వాహకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొని విశ్వనాధుని సత్యనారాయణకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులను ఘనంగా సత్కరించారు.

రేషన్ పంపిణీలో పారదర్శకత పాటించాలి

- సంతపేట చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి

ఒంగోలు, అక్షర ప్రకాశం : అర్హులైన ప్రతి కార్డుదారునికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీ బియ్యం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి సూచించారు. ఒంగోలు నగరంలోని 14వ డివిజన్ సంతపేటలో గల చౌకధరల దుకాణం నెంబర్ 0881024 ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. డీలర్ బెజవాడ సుధారాణి నిర్వహిస్తున్న దుకాణంలో రేషన్ పంపిణీ విధానాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఈ-పోస్ యంత్రాల పనితీరు, ఎలక్ట్రానిక్ తారాజుల ప్రామాణికత, రేషన్ బియ్యం నాణ్యత, బస్తాల బరువు, నిల్వల వివరాలు, పంపిణీ రికార్డులను పరిశీలించారు. కార్డుదారుల బయోమెట్రిక్ నమోదులో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ బియ్యం ప్రతి అర్హునికీ పూర్తి పారదర్శకతతో చేరేలా చౌకధరల దుకాణాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని విజయ్ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, బియ్యం నాణ్యత, తూకం విషయంలో ఎటువంటి లోపాలకు తావులేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన కుటుంబాలకు సక్రమంగా అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని అన్నారు.

విద్యార్థినులకు స్వీయ రక్షణపై అవగాహన

- స్వీయ రక్షణలో విద్యార్థినులకు ప్రాయోగిక శిక్షణ

- భద్రతపై అవగాహనతో పెరుగుతున్న ఆత్మవిశ్వాసం

- 150 మందికి పైగా విద్యార్థినుల ఉత్సాహభరిత భాగస్వామ్యం

- సురక్షిత కళాశాల వాతావరణానికి ఐసీసీ నిరంతర కృషి

చీరాల, అక్షర ప్రకాశం : విద్యార్థినుల భద్రత, సాధికారత లక్ష్యంగా సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో స్వీయ రక్షణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ (ఐసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 150 మందికి పైగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ వివరాలు తెలిపారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత భద్రతపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. జగదీష్‌బాబు పేర్కొన్నారు. స్వీయ రక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం, అప్రమత్తత పెరగడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించే సామర్థ్యం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

ఐసీసీ ప్రిసైడింగ్ ఆఫీసర్ డా. ఆర్.ఎన్.డి. లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం, భద్రతకు కళాశాల యాజమాన్యం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వేధింపులకు తావులేని సురక్షితమైన కళాశాల వాతావరణాన్ని కల్పించేందుకు ఐసీసీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కళాశాలలోనే కాకుండా బయట కూడా విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో, అప్రమత్తంగా తమ భద్రత పట్ల పూర్తి అవగాహనతో ఉండేలా సాధికారత కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సయ్యద్ సలాలుద్దీన్, గౌరవ అతిథిగా ప్రశాంత్‌బాబు పాల్గొన్నారు. శిక్షకులు ప్రమాదకర పరిస్థితుల్లో సురక్షితంగా బయటపడే మార్గాలు, పరిసరాలపై అప్రమత్తత, ప్రమాదాలను ముందుగానే గుర్తించే పద్ధతులతో పాటు వివిధ స్వీయ రక్షణ మెళకువలను విద్యార్థినులకు ప్రదర్శించి వివరించారు. అనంతరం ప్రాయోగిక శిక్షణ కూడా అందించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని, అనుకోని పరిస్థితులను ధైర్యంగా, సమయస్ఫూర్తితో ఎదుర్కొనేందుకు అవసరమైన స్వీయ రక్షణ పద్ధతులను అభ్యసించారు. కార్యక్రమం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసంతో పాటు వాస్తవ జీవితంలో ఎదురయ్యే అనుకోని పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే అవగాహన, నైపుణ్యాలు పెరిగాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల భద్రత, సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ నిర్వహిస్తామని కళాశాల యాజమాన్యం పేర్కొంది. కార్యక్రమంలో ఐసీసీ సభ్యులు, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అక్షర ప్రకాశం
శుక్రవారం 11 - 9 - 2026

చిలకలూరిపేటలో 6,184 ఓట్లు తొలగించే అవకాశం: పొలిటికల్ పార్టీల ప్రతినిధులకు రిటర్నింగ్ ఆఫీసర్ నోటీస్

చిలకలూరిపేట, అక్షర ప్రకాశం : చిలకలూరిపేట నియోజకవర్గంలో ఓటర్ల జాబితా పరిశీలన, ఓట్ల తొలగింపు ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ (ERO) లీలారాణి గురువారం ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ ఆఫీసర్ లీలారాణి మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలో నిబంధనల ప్రకారం సరైన ఆధారాలు లేని సుమారు 6,184 ఓట్లు తొలగించబడే ప్రమాదం ఉందని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. అర్హత కలిగిన ఓటర్లు ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో పాల్గొన్న నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారు, నోటీసులు వచ్చిన వారు వెంటనే స్పందించి, సంబంధిత సరైన ధ్రువపత్రాలను అధికారులకు సమర్పించి తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కీలక సమావేశంలో ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ లీలారాణితో పాటు మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరిబాబు, యడ్లపాడు మరియు నాదెండ్ల మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీల తరఫున నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీ నుండి అజహార్, వైఎస్సార్‌సీపీ నుండి విడదల రవి శాస్త్రి, జనసేన పార్టీ నుండి కోట సాంబ, భారతీయ జనతా పార్టీ నుండి కోట చంద్రబాబు నాయుడు, మరియు కాంగ్రెస్ పార్టీ నుండి ఎం. ప్రసన్న తదితరులు హాజరై తమ సలహాలు, సూచనలు అందించారు.

రేషన్ పంపిణీలో పారదర్శకత పాటించాలి

- సంతపేట చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి

ఒంగోలు, అక్షర ప్రకాశం : అర్హులైన ప్రతి కార్డుదారునికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీ బియ్యం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి సూచిం చారు. ఒంగోలు నగరంలోని 14వ డివిజన్ సంతపేటలో గల చౌకధరల దుకాణం నెంబర్ 0881024 ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. డీలర్ బెజవాడ సుధారాణి నిర్వహిస్తున్న దుకాణంలో రేషన్ పంపిణీ విధానాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఈ-పోస్ యంత్రాల పనితీరు, ఎలక్ట్రానిక్ తారాజుల ప్రామాణికత, రేషన్ బియ్యం నాణ్యత, బస్తాల బరువు, నిల్వల వివరాలు, పంపిణీ రికార్డులను పరిశీలించారు. కార్డుదారుల బయోమెట్రిక్ నమోదులో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ బియ్యం ప్రతి అర్హునికీ పూర్తి పారదర్శకతతో చేరేలా చౌకధరల దుకాణాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని విజయ్ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, బియ్యం నాణ్యత, తూకం విషయంలో ఎటువంటి లోపాలకు తావులేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన కుటుంబాలకు సక్రమంగా అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని అన్నారు.

రాజీమార్గమే రాజీమార్గం... పెండింగ్ కేసులు పరిష్కార వేదిక మెగా లోక్ అదాలత్ 12వ అదనపు జిల్లా జడ్జి భాస్కర్ రావు

పిఠాపురం, అక్షర ప్రకాశం : రాజీ పడ దగిన కేసుల విషయంలో లోక అధాలత్ లను సద్వినియోగం చేసుకోవాలని, వ్యాజ్యాల నుంచి బయట పడాలని పిఠాపురం 12వ అధనపు జిల్లా జడ్జి పి భాస్కరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 12న పిఠాపురం కోర్టు ఆవరణలలో ఉదయం 10 గంటల నుంచి జరిగే లోక్ అధాలత్ ను విజయవంతం చేయాలన్నారు. నాలుగు బెంచ్‌లుగా లోక్ అధాలత్‌లు నిర్వహిస్తామన్నారు. రాజీ పడతగిన క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదాలు, వివాహ సంబందిత, రోడ్డు ప్రమాద, బీమా, బ్యాంకు, పోస్టల్ తదితర కేసులను ఈ లోక్ అధాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. లోక్ అధాల త్‌లో రాజీపడి పరిష్కరించుకున్న కేసులకు ఎటువంటి ఫీజులూ వుండవన్నారు. ఇక్కడ పరిష్కారం అయిన కేసులకు అప్పీలు సైతం లేవని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకుని కాలాన్నీ, ధనాన్ని ఆదా చేసుకోవాలని కోరారు.

కే.జె.పురంలో 53 కొవ్వొత్తులతో టీడీపీ నిరసన

అనకాపల్లి, అక్షర ప్రకాశం : మాడుగుల మండలం కే.జె.పురం గ్రామంలో టీడీపీ నాయకులు 53 కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో ఉంచిన ఘటనకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మాడుగుల మండల క్లస్టర్ ఇన్‌చార్జి బీశెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి మద్దాల ప్రసాద్, టీడీపీ ఇన్‌చార్జి ఎల్లపు రాము, కో-యూనిట్ ఇన్‌చార్జి ఆడారి రమేష్, సీనియర్ నాయకులు బీశెట్టి కోటప్పరావు, పీల సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు కొయిలాడ సన్యాసిరావు, బూత్ కన్వీనర్లు బొడ్డేటి వెంకట్రావు, సూరిశెట్టి వెంకట అప్పారావు, కాళ్ల వెంకట్రావు, పరిమి సోమప్పారావు, పిల్లా సూరి అప్పారావు, రేగడ సూరప్పారావు, కాల్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెల పీఎం ఎస్ఎంఏ కార్యక్రమానికి వచ్చిన గర్భిణీ స్త్రీలకు అన్నప్రసాద భోజనాల అందించిన శాశ్వతదాత సముద్రాల ప్రకాష్ (USA) ధర్మపత్ని రేణుక

- శ్రీ వాసవి సేవ అన్నప్రసాద కమిటీ పర్యవేక్షణలో

కారంపూడి, అక్షర ప్రకాశం : పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల నందు ప్రతినెలా 9వ తారీకు గర్భిణీ స్త్రీల కొరకు పి.ఎం.ఎస్.ఎం.ఏ కార్యక్రమానికి వచ్చే గర్భిణీ స్త్రీలు, ఆశా వర్కర్లు, పేషెంట్లు, ఏ ఎన్ ఎం ఎస్ లు, ఎం ఎల్ హెచ్ పి ఎస్‌లు, స్టాఫ్ కు 200 మందికి అన్న ప్రసాద భోజనాల పంపిణీకి సహకరించిన దాతలు సముద్రాల ప్రకాష్ (usa) ధర్మపత్ని రేణుక కూతురు శృతి, కుమారుడు శ్రీకర్, సహకారంతో అన్న ప్రసాద భోజనాలు అందించడం జరిగినది. వెలుగురు శేషారావు ధర్మపత్ని భారతి పర్యవేక్షణలో ఈ నారాయణ సేవా కార్యక్రమంలో అన్న ప్రసాద కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, మహిళా కమిటీ సభ్యులు చిన్ని లక్ష్మి, చిన్ని అనంతలక్ష్మి, పల్లా పద్మ, సూరే ధనలక్ష్మి, గుండా మహేశ్వరి, సముద్రాల పద్మ, బచ్చు నాగమణి, ఊటుకూరి వాణి, వైద్యశాల డాక్టర్లు డాక్టర్ లక్ష్మీ మౌనిక, డాక్టర్ రమ్య రిటైర్డ్ సి హెచ్ ఓ కే. మల్లయ్య, సూపర్వైజర్ మస్తాన్ వలి, హెల్త్ అసిస్టెంట్ ఎం లాలు నాయక్ తదితరులు ఈ నారాయణ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలపై పోలీసుల కీలక సూచనలు

- నిబంధనలు వెల్లడించిన పేట అర్బన్ సీఐ పి. రమేష్

అక్షర ప్రకాశం : చిలకలూరిపేట పట్టణంలో రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పట్టణ ప్రజలకు, వినాయక మండపాల నిర్వాహకులకు అర్బన్ సీఐ పి. రమేష్ పలు కీలక సూచనలు జారీ చేశారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరుతూ మండపాల నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన నిబంధనలను ఆయన వివరించారు.

ఐదుగురితో కమిటీ ఏర్పాటు తప్పనిసరి

వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే వారు తప్పనిసరిగా కనీసం ఐదుగురు సభ్యులతో కూడిన ఒక కమిటీగా ఏర్పడాలి. విగ్రహాన్ని 3, 5, 7 లేదా 9 రోజులు.. ఎన్ని రోజులు ఉంచినా ఆ కమిటీదే పూర్తి బాధ్యత. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు 24 గంటలూ (24/7) అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆన్‌లైన్‌లో వివరాల నమోదు – అనుమతులు

విగ్రహ ప్రతిష్టకు పోలీసు, మున్సిపల్, విద్యుత్ మరియు అగ్నిమాపక (ఫైర్) శాఖల నుండి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. విగ్రహాన్ని ప్రతిష్టించే ప్రదేశం, సమయం, నిమజ్జనం చేసే తేదీ, సమయం, ఊరేగింపు వెళ్లే మార్గం (రూట్ మ్యాప్), నిమజ్జనానికి ఉపయోగించే వాహనం మరియు డ్రైవర్ వివరాలను వినతిపత్రంలో పొందుపరిచి, ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

మండపాల వద్ద రెండు సీసీ కెమెరాలు

ప్రతి మండపం వద్ద నిఘా కోసం తప్పనిసరిగా కనీసం రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. మండపాల వద్ద జరిగే చిన్న సంఘటనలైనా కుల, మత ఘర్షణలకు దారి తీసే ప్రమాదం ఉన్నందున ఎవరూ అలాంటి వాటికి తావివ్వకూడదు. ఇప్పటికే పోలీసు సిబ్బంది అన్ని వినాయక పందిళ్లను సందర్శించి పర్యవేక్షిస్తున్నారు.

విద్యుత్ భద్రత – ధ్వని నియంత్రణ

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా ప్రతి మండపం వద్ద ఒక ఎలక్ట్రీషియన్‌ను అందుబాటులో ఉంచుకోవాలి. చుట్టుపక్కల ఉండే వృద్ధులు, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు, చదువుకునే విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా మైకేల వాల్యూమ్ తక్కువ డెసిబెల్స్‌లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

శాంతియుతంగా నిమజ్జనోత్సవం

నిమజ్జనం రోజున ఎలాంటి అసభ్యకరమైన నృత్యాలు చేయకూడదు. ఎటువంటి గొడవలకు, ఘర్షణలకు వెళ్లకుండా సామరస్యపూర్వక వాతావరణంలో పండుగను జరుపుకోవాలి. ఇందుకు పోలీసు వారికి ప్రజలు, నిర్వాహకులు పూర్తిగా సహకరించాలని, ఏవైనా ఇబ్బందులు లేదా సందేహాలు ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని సీఐ రమేష్ తెలిపారు.

మోటారు సైకిళ్ల దొంగలకు 13 నెలలు జైలు.. రూ.500 జరిమానా

పిఠాపురం, అక్షర ప్రకాశం : పిఠాపురం రూరల్, గొల్లప్రోలు స్టేషన్ పరిధిలో మోటారు సైకిళ్లు చోరీకి పాల్పడిన ఇద్దరు ముద్దాయిలకు 13 నెలలు జైలు, రూ.500 చొప్పున జరిమానా విదిస్తూ పిఠాపురం అధనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వి వెంకట అపర్ణ గురువారం తీర్పు చెప్పారు. పోలీసుల కథనం ప్రకారం శంఖవరం మండలం బెండపూడికి చెందిన అన్నవరం దేవస్థానం ఉద్యోగి నాగబత్తుల వీరభద్రయ్య శర్మ ఫిబ్రవరి 27న పిఠాపురం మండలం ఎఫ్ కె పాలెం దుర్గదేవి ఆలయం వద్ద తన మోటారు సైకిల్ వుంచి దర్శనం చేసుకుని వచ్చే సరికి మోటారు సైకిల్ చోరీకి గురైంది. అదే రోజున కత్తిపూడికి చెందిన చింతాల రాంబాబు పిఠాపురం మండలం జల్లూరు ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద తన మోటారు సైకిలు వుంచి పక్కనే హోటల్ లో టిఫిన్ చేసి వచ్చేసరికి మోటారు సైకిల్ ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ రెండు ఫిర్యాదులపై రూరల్ ఎస్ ఐ బాషా కేసు నమోదు చేసి నిందితులు కాకినాడ రూరల్ మండలం రాయుడు పాలెంకు చెందిన విత్తనాల దుర్గా ప్రసాద్, కాకినాడ ప్రతాప్ నగర్ కు చెందిన మజ్జి నరేంద్ర కుమార్ లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టులో వాదోప వాదాలు అనంతరం నేరం రుజువు కావడంతో ఇద్దరు ముద్దాయిలకు 13 నెలల జైలు, రూ.500 జరిమానా విదిస్తూ అధనపు మేజిస్ట్రేట్ అపర్ణ తీర్పు చెప్పారు. ఈ కేసులో ఏపీపీలు ఏ నాగ లీలా రోజా, డి నాగరాజు ప్రాసిక్యూషన్ నిర్వహించారు. కోర్టు కానిస్టేబుల్ శ్యామ్ సాక్షులను ప్రవేశ పెట్టారు.

గొల్లప్రోలు స్టేషన్ పరిధిలో : ఈ ఇద్దరు ముద్దాయిలూ గొల్లప్రోలు శివాలయం వద్ద మోటారు సైకిళ్లు చోరీకి పాల్పడిన కేసులో మేజిస్ట్రేట్ వి అపర్ణ గురువారం శిక్ష విధించారు. ఏలేశ్వరం మండలం యర్రవరంలో నివాసం వుంటూ పోలవరం కాలువ పనుల సూపర్ వైజర్ గా పని చేస్తున్న ననపల అప్పలనాయుడు ఫిబ్రవరి 18న గొల్లప్రోలు శివాలయానికి దర్శనానికి వచ్చాడు. బండి ఆలయం బయట వుంచి దర్శనం చేసుకుని బయటికి వచ్చి చూసేసరికి మోటారు సైకిల్ చోరీకి గురైంది. ఇదే విధంగా అరబిందోలో పని చేస్తున్న పిఠాపురం మండలం కొత్త కందరాడకు చెందిన చెవల రాజా మోటారు సైకిల్ సైతం ఆలయం వద్దే చోరీకి గురైంది. కేసును గొల్లప్రోలు ఎస్ ఐ రామకృష్ణ దర్యాప్తు చేశారు. నిందితులు విత్తనాల దుర్గా ప్రసాద్, మజ్జి నరేంద్ర కుమార్ లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వాదోప వాదాలు అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయిలు ఇద్దరికీ 13 నెలల జైలు, రూ.500 జరిమానా విదిస్తూ మేజిస్ట్రేట్ అపర్ణ తీర్పు చెప్పారు. ఈ కేసులో ఏపీపీలు ఏ నాగ లీలా రోజా, డి నాగరాజు ప్రాసిక్యూషన్ నిర్వహించారు. కోర్టు కానిస్టేబుల్ వై లచ్చబాబు సాక్షులను ప్రవేశ పెట్టారు.

Published by : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. , Printed by : Nannuri Subba Rao, Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Printed at : Vijaya Printers (offset Printing), Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Published from : Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Editor : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Cell : 9848997263, E.mail : aksharaprakasam@gmail.com,